# జిల్లాలో 36 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

**వెల్లడించిన కలెక్టర్ యాస్మిన్ బాషా**

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 16: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో మహిళలు, దివ్యాంగులు, మోడల్, యువతకు 36 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు అన్ని నియోజకవర్గాల్లో మహిళలు, దివ్యాంగులు, మోడల్, యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలంలో పోలింగ్ కేంద్రం నంబర్ 22ను మహిళలు, 47 నంబర్ కేంద్రం మోడల్ పోలింగ్ కేంద్రంగా, మల్లాపూర్ మండలంలోని 56 పోలింగ్ కేంద్రాన్ని మహిళలకు, 66 నంబర్ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా, కోరుట్ల మండలంలోని 147 పోలింగ్ కేంద్రాన్ని మహిళలకు, 97, 164ను మోడల్ కేంద్రంగా, 134ను యువతకు కేటాయించామన్నారు. మెట్‌పల్లి మండలంలోని 38, 200 కేంద్రాలను మహిళలకు, 236 ను దివ్యాంగులకు, 208 కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామని, జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మండలంలోని 27, 39 నంబర్ కేంద్రాలను మహిళలకు, 67 నంబరు కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా, సారంగాపూర్ మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని 101 మహిళలకు, 104ను మోడల్ కేంద్రంగా, 90 యువతకు కేటాయించామన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రం 116ను మహిళలకు, 254 మోడల్ కేంద్రంగా, జగిత్యాల పట్టణంలోని 148ను మహిళలకు, 247ను దివ్యాంగులకు, 155ను మోడల్ కేంద్రంగా, ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం మండలంలోని 58వ కేంద్రాన్ని మహిళలకు, 57ను మోడల్ కేంద్రంగా, ధర్మపురి మండలంలోని 31వ కేంద్రాన్ని మహిళలకు, 32వ కేంద్రాన్ని దివ్యాంగులకు, ధర్మారం మండలంలోని 133వ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా, 162వ కేం్రందాన్ని యువత కోసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎండపల్లి మండలంలోని 97వ పోలింగ్ కేంద్రాన్ని మహిళలకు, గొల్లపెల్లి మండలంలోని 181వ కేంద్రాన్ని మహిళలకు, 210వ కేంద్రాన్ని మోడల్‌గా, పెగడపెల్లి మండలంలోని 245వ కేంద్రాన్ని మహిళలకు, 253వ కేంద్రాన్ని మోడల్‌గా, వెల్గటూర్‌లోని 76వ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# సంజయ్ కల్వకుంట్లను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- ఇబ్రహీంపట్నంలో దుర్గాదేవీ మండపాల్లో సతీమణితో కలిసి పూజలు



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16: రాబోయే ఎన్నికల్లో తన తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడని, తనను ఆదరించినట్లుగానే తన కొడుకును ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత, కొత్త బస్టాండ్ వద్ద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజ దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరీ, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొన్‌కంటి వెంకట్, ఎంపీటీసీలు తిమ్మని రాములు, చిన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపీ, వైస్ చైర్మన్ మోహన్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నేమూరి సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు రెబ్బాటి రాజేందర్, ఉప సర్పంచ్ గూడ రాంరెడ్డి, నాయకులు జగన్‌రావు, జేగీ సుమన్, గూడ పాపన్న, వాల్గొట్ నరేశ్, కమలాకర్‌రావు, పుష్పలత, అలిశెట్టి మోహన్, గణేశ్, విక్రమ్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు కంతం గోవర్ధన్ పాల్గొన్నారు.

# ఓటు వేయండి.. కూల్ డ్రింక్ తాగండి

- ఉదయమే ఓటు వేసిన వారికి ఇవ్వాలని నిర్ణయం
- ఓటరు నమోదు పెంపునకు గ్రీన్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ వినూత్న ప్రయోగం
- సోషల్ మీడియాలో వైరల్




సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటో

జగిత్యాల టౌన్, అక్టోబర్ 16: ఓటు వేయండి.. కూల్‌డ్రింక్ తాగండి.. ఎవరైతే ఉదయం పూట ఓటు వేస్తారో వారికి కూల్ డ్రింక్ ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వైరల్‌గా మారింది. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపూర్ గ్రామంలోని ఓటర్లలో ఉత్సాహం నింపడానికి గ్రీన్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మల్లారెడ్డి ఉచిత కూల్‌డ్రింక్ ఆఫర్‌ను ప్రకటించారు. గ్రామంలో మొత్తం 3152 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1511, స్త్రీలు 1641 మంది ఉన్నారన్నారు. ఓటర్లు ఉదయం పూట బూత్‌లలోకి వెళ్లి ఓట్లు వేయడం లేదని గ్రహించి ఈ ఆఫర్‌ను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. దీంతో ఎవరైతే ఉదయం 8.30 గంటల లోపు వెళ్లి ఓటు వేసి తిరిగి వచ్చి తమ వేలుకు ఉన్న సిరా గుర్తును చూపిస్తారో వారిలో మొదటి 50 మందికి 250 మిల్లీలీటర్ల కూల్‌డ్రింక్స్‌ను అందిస్తామన్నారు. దీంతో ఓటింగ్ శాతం పెరుగుతుందని, లక్ష్మీపూర్ ఓటింగ్ శాతంలో మొదటి స్థానంలో నిలవాలన్నదే తన ఉద్దేశం అని అన్నారు. ఈ ఆఫర్‌తో రూపొందించిన ప్రకటనను సోషల్ మీడియాలో పెట్టడంతో విశేష ఆదరణ లభిస్తున్నదన్నారు.



గాజుల అలంకరణలో దుర్గాదేవీ



పండ్ల అలంకరణలో అమ్మవారు

## ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జగిత్యాల, అక్టోబర్ 16: జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో శ్రీగాయత్రీ దుర్గాదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. అలాగే అష్టలక్ష్మీ దేవాలయం ఆవరణలో శ్రీకనక దుర్గా అమ్మవారిని పండ్లతో అలంకరించారు. నవ దుర్గా శక్తి పీఠం ఆధ్వర్యంలో పూలంగి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కెనాల్ నిర్మాణానికి సహకరిస్తాం

ధర్మారం,అక్టోబర్ 16: వరద కాలువకు అనుబంధంగా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ రేవెల్లి శివారు నుంచి నూతనంగా నిర్మించే కొత్త పంట కాలువ నిర్మాణానికి సహకరిస్తామని పత్తిపాక, మల్లాపూర్ గ్రామాల రైతులు అధికారులకు హామీ ఇచ్చారు. కొత్త కాలువ నిర్మాణంపై రామగుండం పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భిక్షపతి ఆధ్వర్యంలో పత్తిపాక జీపీ ఆవరణలో సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఆర్డీవో మధు మోహన్, నీటిపారుదల శాఖ వేములవాడ డివిజన్ ఈఈ సంతు ప్రకాశ్ రావు, డీఈఈలు ఎం శ్రీనివాస్,ఎండీ రఫీ హాజరయ్యారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతె వరద కాలువకు అనుబంధంగా తిరుమలాపూర్ నుంచి ఎస్సారెస్పీ కాకతీయ కాలువ మీదుగా అక్విడక్టు నిర్మించి చొప్పదండి మండలం కుర్మపల్లి మీదుగా ధర్మారం మండలం మల్లాపూర్, పత్తిపాక వరకు సుమారు 8.11 కిలోమీటర్లు కాలువ నిర్మిస్తామని అధికా రులు తెలిపారు. ఈ రెండు గ్రామాల్లోని 3వేల ఎకరాలకు 49 క్యూసెక్కుల నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించామని వివరించారు.

## ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

జగిత్యాల, అక్టోబర్ 16: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు భారత్ జాగృతి జిల్లా అధ్యక్షుడు అమర్‌దీప్ గౌడ్, నియోజకవర్గ నాయకుడు నీలగిరి రాజేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జంబిగద్దె నుంచి బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించి, అనంతరం మినీ స్టేడియంలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తామన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 16: జగిత్యాల పట్టణ ముస్లీం కమిటీ ఉపాధ్యక్షుడు ఎండీ గయాసోద్దీన్ అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతుండగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. గయాసోద్దీన్‌ను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి రాజేశం గౌడ్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సతీమణి..



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక

జగిత్యాల రూరల్, అక్టోబర్ 16: జగిత్యాల పట్టణ బీఆర్‌ఎస్ యువజన నాయకుడు దోనకంటి సాయిరాం ఆదివారం మృతి చెందగా సోమవారం అతడి కుటుంబాన్ని మల్యాల పోతారం గ్రామంలో ఎమ్మెల్యే సతీమణి రాధిక పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి పొలాసలో క్రీడాపోటీలు



క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు, ఏడీఆర్

జగిత్యాల టౌన్, అక్టోబరు 16: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ జీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల్లో రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 230 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్, టెబుల్ టెన్నీస్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నీకాయిట్, రన్నింగ్, జావెలిన్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలతో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గులు, పాటలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకటరమణ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్ల సత్యనారాయణ, డైరెక్టర్ పాలిటెక్నిక్ డాక్టర్ జీ పద్మజ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్ భారతిభట్, యూనివర్సిటీ క్రీడాపోటీల పరిశీలకుడు డాక్టర్ జే సురేశ్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ఓఎస్ఏలు, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

## రాంపూర్ పంప్‌హౌస్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

మల్యాల, అక్టోబర్ 16: నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఇందిరమ్మ వరద కాలువలోని గౌరవెల్లి రిజర్వాయర్ విస్తరణకు మంగళవారం రాంపూర్ గ్రామంలో గల పునర్జీవ పంప్‌హౌస్-1లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నట్లు ఈఈ సుధాకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం రామగుండం వారి సమక్షంలో నిర్వహిస్తున్నట్లు సమీప ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.